
చిత్తూరులో తరలివచ్చిన జనం


ఎస్ఆర్‌పురం మండలం గంగమ్మ గుడి గ్రామంలో..

ఈ ఎన్నికల్లో అభివృద్ధిని గెలిపించండి


యువోత్సాహం

వైసీపీ అరాచకాన్ని తిప్పికొట్టండి

ప్రజలకు భువనేశ్వరి పిలుపు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ముగ్గురికి పరామర్శ

నారాయణవనం/సత్యవేడు/చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 23: 'చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ఏ విధంగా పరుగులు పెట్టిందో మనమంతా చూశాం. ఈ ఐదేళ్లలో ఎలాంటి అరాచకాలు జరుగుతున్నాయో కూడా మనం చూస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపైన దాడులు జరుగుతున్నాయి. చంద్రబాబునాయుడుపైనా అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారు. రానున్న ఎన్నికలు అరాచకానికి.. అభివృద్ధికి మధ్య జరిగేవి. ప్రజలందరూ టీడీపీ వైపు నిలబడి అభివృద్ధిని గెలిపించాలి' అని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం ఆమె చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులో మోహన్‌నాయుడు.. శ్రీరంగరాజపురం మండలం గంగమ్మ గుడి గ్రామంలో కరణం ఆంజనేయులు నాయుడు.. తిరుపతి జిల్లా నారాయణవనం మండలం తుంబూరులో మునివేలు కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. తుంబూరు, ముత్తుకూరులో ఆమె మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందన్నారు. అందులో భాగంగా ప్రజలను భయపెట్టి ఇళ్లకు పరిమితం చేసి రిగ్గింగ్ చేసుకోవాలని చూస్తోందన్నారు. వీటిని అందరూ తిప్పి కొట్టాలని ఆమె కోరారు. చంద్రబాబును అక్రమంగా జైలు పెట్టినప్పుడు మహిళలు ముందుకొచ్చి అండగా నిలిచారన్నారు. ఇంటిపట్టునే ఉండే మహిళలూ బయటకు పోరాడారని గుర్తుచేశారు. టీడీపీ పాలనలో మహిళలకు రక్షణ ఉండేదని.. ఇప్పుడా పరిస్థితి ఉందా అని అడగారు. 'లేదు.. లేదు' అంటూ మహిళలు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో యువతకు గంజాయి అలవాటు చేసిందని ఈ ప్రభుత్వమని ఆమె విమర్శించారు. ఆ మత్తులో మహిళలపై అఘాయిత్యాలు చేస్తున్నారని తెలిపారు. మహిళల కోసం చంద్రబాబు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని.. ఇప్పుడు అధికారంలోకి వస్తే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారని వివరించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ఆమె ప్రస్తావించారు. 'నేనిలా ముందుకు వచ్చానంటే.. ఈ ధైర్యం మీరిచ్చిందే' అంటూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. కాగా, పుత్తూరు బైపాస్ రోడ్డులో సత్యవేడు వైసీపీ తిరుగుబాటు ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు, జడ్పీటీసీ సుమన్‌కుమార్, కుటుంబ సభ్యులతో కలిసి భువనేశ్వరికి పసుపు, కుంకుమ, చీరను సారెగా అందించారు.

నేనున్నానని భరోసానిస్తూ..

- ముగిసిన భువనేశ్వరి పర్యటన
- 15 కుటుంబాలకు పరామర్శ

చిత్తూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అరెస్టుతో మనస్తాపంతో మృతి చెందినవారి కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి ఓదార్చారు. తానున్నానంటూ భరోసానిచ్చారు. ఆమె నాలుగు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. సాయంత్రం ఆమె రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ నాలుగు రోజుల్లో చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో 14 కుటుంబాలు, తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో ఒక కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాలు భువనేశ్వరిని చూసి కన్నీరు మున్నీరు పెట్టుకోగా.. ఆమె ఓదార్చారు. బంగారుపాళ్యం మండలం టేకుమందలో వైసీపీ దాడిలో రెండు కళ్లను కోల్పోయిన హంసవేణిని పరామర్శించి, దివ్యాంగుడైన ఆమె కుమారుడి చదువు బాధ్యతను తీసుకుంటానని హామీనిచ్చారు. అన్నిచోట్లా భువనేశ్వరిని చూసేందుకు, సంఘీభావం తెలిపేందుకు పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, మహిళలు, స్థానికులు తరలివచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. మార్గమధ్యంలో జనాన్ని చూసి కారు దిగి పలకరించారు. ఆమె పర్యటన ఆయా నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలను ఉత్సాహ పరిచింది.

అండగా ఉంటాం



తుంబూరులో టీడీపీ కార్యకర్త మునివేలు చిత్రపటానికి నివాళులర్పించిన భువనేశ్వరి, అతడి తల్లిదండ్రులను పరామర్శించారు. ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ చిత్తూరు, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు పులివర్తి నాని, నరసింహ యాదవ్, డాక్టర్ హెలెన్, జేడీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

- నారాయణవనం

పిల్లల చదువు బాధ్యత మాదే



చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులోని మోహన్‌నాయుడు ఇద్దరి పిల్లల చదువు బాధ్యతను భువనేశ్వరి తీసుకున్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పులివర్తి నాని, చంద్రప్రకాష్, కటారి హేమలత, జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు రూరల్

అధైర్యపడొద్దు



శ్రీరంగరాజపురం మండలం గంగమ్మగుడి గ్రామంలోని కరణం ఆంజనేయులునాయుడు(68) కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. అధైర్యపడొద్దంటూ.. అండగా ఉంటామంటూ మృతుడి భార్య, ఇద్దరు కుమారులకు ధైర్యం చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ వీఎం థామస్, పరిశీలకుడు రవిప్రకాశ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ, నాయకులు పాల్గొన్నారు. - శ్రీరంగరాజపురం


చిత్తూరులో తెలుగు మహిళల స్వాగతం

అతివేగానికి ఇద్దరు విద్యార్థుల బలి

- ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును బైక్‌తో వేగంగా ఢీకొట్టారు
- సంఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరి మృతి



పునీత్ కుమార్, అమీన్ (ఫైల్ ఫొటోలు)

పూతలపట్టు, ఫిబ్రవరి 23: అతివేగానికి ఇద్దరు విద్యార్థులు బలయ్యారు. ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును బైక్‌తో వేగంగా ఢీకొనడంతో సంఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి పల్లెవీధికి చెందిన లేట్ మస్తాన్ కుమార్తె అమీన్ (19) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె తల్లి కువైట్‌లో ఉంటూ బిడ్డను చదివిస్తోంది. తిరుపతి సమీపంలోని కొత్తపల్లికి చెందిన పెంచలయ్య కుమారుడు పునీత్ కుమార్ (19) కూడా ఇదే కళాశాలలో బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పునీత్ తండ్రి కూలిపనులు చేస్తూ చదివిస్తున్నాడు. ఈ ఇద్దరు విద్యార్థులు శుక్రవారం ద్విచక్ర వాహనంపై కాణిపాకానికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఉదయం 11 గంటల సమయంలో పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోట బస్టాపు వద్ద కుప్పం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నుంచి ప్రయాణికులు దిగుతున్నారు. ఆ సమయంలో వీరు వేగంగా వస్తూ బస్సును వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అమీన్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన పునీత్ కుమార్‌ను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను కూడా మృతి చెందాడు. సమాచారం అందుకున్న పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్ తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకుని బోరున విలపించారు. మృతదేహాలకు శనివారం పంచనామా నిర్వహించనున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సుదర్శన్ ప్రసాద్

26న సీఎం జగన్ రాక



చిత్తూరు కలెక్టరేట్/రామకుప్పం, ఫిబ్రవరి 23: సీఎం జగన్మోహన్‌రెడ్డి కుప్పం నియోజకవర్గ పర్యటన ఖరారైంది. ఆయన ఈనెల 26న జిల్లాకు రానున్నారు. సోమవారం ఉదయం 9.45కు ఆయన రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి రామకుప్పం మండలం రాజుపేట హెలిప్యాడ్‌కు 10.25కు చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కాసేపు మాట్లాడాక.. 10.30 గంటలకు పూజాస్థలానికి చేరుకుంటారు. అక్కడ ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శిస్తారు. హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని విడుదల చేస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.05కు హెలికాప్టర్‌లో బయలుదేరి శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లెకు చేరుకుంటారు. బహిరంగ సభాస్థలం వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌లో పాల్గొని కొత్త చెరువుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.45 నుంచి మధ్యాహ్నం 1.10 వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద నాయకులతో మాట్లాడి.. హెలికాప్టర్‌లో రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరతారు.

గంజాయి ముఠా అరెస్టు

రూ.3లక్షల విలువైన ఆరు కిలోల గంజాయి సీజ్

చిత్తూరు, ఫిబ్రవరి 23: గంజాయి విక్రయించే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్దనుంచి రూ.3లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ విశ్వనాథరెడ్డితో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి మీడియాకు శుక్రవారం వివరించారు. చిత్తూరు, నగర శివారులో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో నీమ్స్ గార్డెన్ వద్ద ఎస్ఐ, సిబ్బంది దాడులు చేశారు. జీడీ నెల్లూరు మండలం న్యూ కాలనీకి చెందిన చంద్రు(23), కొంగారెడ్డిపల్లెలోని సీటీఎం రోడ్డుకు చెందిన దిలీప్(23), తోటపాళ్యంకు చెందిన రామకృష్ణ(27)లను అదుపులోకి తీసుకుని విచారించారు. వైజాగ్ నుంచి గంజాయిని తీసుకొచ్చి చిత్తూరు, నగరశివారులో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులను పట్టుకున్నప్పుడు ఒక్కొక్కరి వద్ద రెండు కిలోల చొప్పున ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. ఈ అక్రమ వ్యాపారంలో మరికొంత మంది కూడా ఉన్నట్లు గుర్తించామని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. పట్టుబడిన నిందితుల్ని రిమాండ్‌కు తరలించామన్నారు.


నిందితులు, గంజాయిని మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి


పరీక్షల నిర్వహణపై సూచనలిస్తున్న డీఆర్వో పుల్లయ్య

గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 23: జిల్లాలో ఆదివారం జరగనున్న గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో పుల్లయ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పరీక్షలకు సంబంధించిన రూట్, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. 9,411 మంది అభ్యర్థులకోసం చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పూతలపట్టు ప్రాంతాల్లో 20 కేంద్రాల్లో 386 హాల్స్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను మూయించి, 144 సెక్షన్ అమల్లో ఉండేలా చూడాలని తహసీల్దార్లకు సూచించారు. డ్వామా పీడీ రాజశేఖర్, ఏపీపీఎస్సీ అధికారులు రఘునాథ్, ఆంజనేయులు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ గుణశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గురురూప కీచకుడు

- ఉపాధ్యాయుడిపై దాడి.. అధికారుల విచారణ


ఎస్ఆర్ కండిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

పాలసముద్రం, ఫిబ్రవరి 23: విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు వక్రబుద్ధి చూపాడు. ఇతడి లైంగిక వేధింపులపై విద్యార్థినుల ఫిర్యాదుతో తల్లిదండ్రులు ఆగ్రహం చెందారు. అతడిపై దాడి చేసి నిర్బంధించారు. ఈ ఘటన శుక్రవారం పాలసముద్రం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎస్ఆర్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు శంకర్ విద్యార్థినుల పట్ల వెకిలి చేష్టలు చేస్తుండటంతో వారు విసుగు చెందారు. ఇతడి తీరుపై తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు, వారి బంధువులు కలిసి శుక్రవారం పాఠశాలకు వచ్చి తరగతి గదిలో ఉన్న శంకర్‌పై దాడిచేశారు. సహచర ఉపాధ్యాయులు గుమిగూడి జరిగిన సంఘటనపై ఆరాతీశారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ చెప్పారు. ఇలాంటి తప్పు చేయనని, క్షమించాలంటూ ఉపాధ్యాయుడు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రాధేయపడ్డాడు. ఈ వ్యవహారాన్ని డీఈవో చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో గంగాధరనెల్లూరు ఎంఈవో గుణశేఖర్ రెడ్డి, పాలసముద్రం ఎంఈవో-2 గిరిజ పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థినులతోనూ విడివిడిగా సమావేశమయ్యారు. కాగా, చదువులో వెనుకబడి ఉన్న వారిని మందలించడంతో తనపై కక్షకట్టి అభాండాలు వేస్తున్నారని విచారణ అధికారుల ఎదుట ఉపాధ్యాయుడు శంకర్ వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఏడాదిగా ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు శంకర్‌తోపాటు ప్రధానోపాధ్యాయుడు మనోహర్ నాయుడు తమ పాఠశాలకు అవసరం లేదని, బదిలీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

ఎన్నికల్లో డబ్బులు తరలించడానికే లీజుకు హెలికాప్టర్లు

టీడీపీ ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరిప్రసాద్

తవణంపల్లె, ఫిబ్రవరి 23: ఎన్నికల్లో డబ్బులు తరలించడానికే హెలికాప్టర్లను సీఎం లీజుకు తీసుకున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. తవణంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వానికి సంబంధించిన హెలికాప్టర్లు అందుబాటులో ఉన్నప్పటికీ ఉగ్రవాదుల నుంచి ప్రమాదం పొంచి ఉన్నదనే సాకుతో రెండు హెలికాప్టర్లను కోట్లాది రూపాయల ప్రజాధనంతో లీజుకు తీసుకోవడం దారుణమన్నారు. ఈ లీజు కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేసి.. నెలకు రూ.7.5 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని టీడీపీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం..హెలికాప్టర్లను లీజుకుతీసుకోవడం విడ్డూరమన్నారు.టీడీపీ నాయకులు మధు, వినాయక, చిట్టెమ్మ, షబ్బీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.97.07 లక్షలు



చైర్మన్, ఈవో పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.97,07,788 లభించినట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం హుండీకానుకలను చైర్మన్, ఈవో పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఈ ఆదాయంలో 131 యూఎస్ఏ, 250 ఆస్ట్రేలియా, 50 కెనడా, 10 సింగపూరు డాలర్లు, 5 యూఏఈ దిర్హామ్స్, 11 మలేసియా రింగిట్స్‌తోపాటు 38 గ్రాముల బంగారం, 950 గ్రాముల వెండి లభించాయి. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.5,470, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.11,352 ఆదాయం సమకూరింది. ఈ లెక్కింపులో ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

కలవగుంటలో భారీ చోరీ

ఓ ఇంట్లో రూ.7లక్షలు, 40 గ్రాముల బంగారం, అర కిలో వెండి అపహరణ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పెనుమూరు, ఫిబ్రవరి 23: పెనుమూరు మండలంలోని కలవగుంట గ్రామంలో కేశవాచ్చారి కుమారుడు రాజగోపాల్ ఇంట్లో శుక్రవారం భారీ చోరీ జరిగింది. రూ.7లక్షలు, 40 గ్రాముల బంగారు నగలు, అర కిలో వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం కుటుంబమంతా మురకంబట్టులోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కి వెళ్లి, సాయంత్రం ఆరు గంటలకు తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో లోపలకెళ్లి చూశారు. బీరువాలోని రూ.7లక్షలతోపాటు 40 గ్రాముల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి వస్తువులు కనిపించలేదు. చోరీ జరిగిందని అర్థమవడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ సంఘటనా చేరుకుని, ఆధారాలను సేకరించింది. ఇంత పెద్ద మొత్తం చోరీ కావడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది.

అటవీశాఖ సిబ్బందిపైకి దూసుకెళ్లిన కారు

● కానిస్టేబుల్‌కు, ఫారెస్టు వాచ్‌మాన్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న ప్రభాకర రావు

ఏర్పేడు, ఫిబ్రవరి 23:వాహనాలు తనిఖీ చేస్తున్న అటవీశాఖ సిబ్బందిపై ఓ కారు దూసుకెళ్లడంతో ఇద్దరు గాయపడ్డారు.ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ ఈ ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.ఎర్రచందనం తరలిపోతోందన్న సమాచారంతో తిరుపతి ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ తన సిబ్బందితో ఏర్పేడు మండలం చింతలపాళెం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్నారు. టీఎస్ 09 ఈఎస్ 5767 నెంబరు గల కారు తనిఖీలకు సహకరించకుండా వేగంగా చింతలపాళెం టోల్‌ప్లాజా వైపు వెళ్లింది.తప్పించుకుపోయే క్రమంలో అక్కడ తనిఖీ చేస్తున్న మరో టీముపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ కేవీ ప్రభాకర రావుకు, ఫారెస్టు వాచ్‌మాన్ సుబ్రహ్మణ్యానికి గాయాలయ్యాయి.వీరిలో ప్రభాకర రావు కరకంబాడి సమీపంలోని అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆయన తలకు బలమైన గాయం కావడంతో సర్జరీ చేసినట్లు సమాచారం.

రెండు కార్లు ఢీ : ముగ్గురికి గాయాలు

రెండు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్



గుడిపాల, ఫిబ్రవరి 23: చిత్తూరు-వేలూరు, బెంగళూరు- చెన్నై జాతీయ రహదారిలోని సీఎంసీ సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. హైవే నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాహనాలు ఈ ప్రాంతంలో ఒకేవైపు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్తున్న కారు, వేలూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాల్లోని ముగ్గురికి గాయాలవ్వగా, చికిత్స నిమిత్తం 190 రామాపురం సీఎంసీలో చేర్పించారు. మరోవైపు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. గుడిపాల ఏఎస్ఐ మునివేలు, చిత్తూరు ట్రాఫిక్ పోలీసులొచ్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ రెండు కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 23: టీడీపీ కార్యకర్తల మృతుల కుటుంబాలకు శుక్రవారం నారా భువనేశ్వరి రూ2 లక్షల ఆర్థిక సాయం అందించారు. గతేడాది ఆగస్టు 4న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చారు. అప్పుడు పూతలపట్టు మార్గంలో నిర్వహించిన ర్యాలీలో జరిగిన ప్రమాదంలో చెర్లోపల్లె పంచాయతీ పేయనకండిగకు చెందిన వేలు యాదవ్, ఏనుగుండ్లపల్లెకు చెందిన పి.అమర్నాథ్ ప్రమాదవశాత్తు మరణించారు. శుక్రవారం నారా భువనేశ్వరి ఒక్కో కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, నేతలు చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, సురేంద్రకుమార్, శశికర్ బాబు, రఘు, మోహన్‌రాజ్, మంజూస్, రాజేష్, గురేష్, శ్రీనివాసులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీకి న్యాక్ గుర్తింపు

దేశంలోనే తొలి న్యాక్ పశువైద్య వర్సిటీగా గుర్తింపు



తిరుపతి(విద్య),ఫిబ్రవరి 23: తిరుపతి కేంద్రంగా నడిచే శ్రీవేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీకి తొలిసారిగా న్యాక్ గుర్తింపు లభించింది. దేశంలోని పశువైద్య విశ్వవిద్యాలయాల్లో న్యాక్ గుర్తింపు కలిగిన వర్సిటీగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడ్రోజుల పాటు చైర్మన్ డాక్టర్ సతీష్‌కుమార్ భండారీ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల న్యాక్ పీర్ రివ్యూ టీం వర్సిటీలో పర్యటించి అనుబంధ కళాశాలలను తనిఖీ చేసి ఐదేళ్ల కాలానికి(2022-2027వరకు) న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ గుర్తింపునిచ్చారు. ఇప్పటికే వర్సిటీకి 2027 మార్చి31 వరకు ఐదేళ్ల కాలానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్), వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(వీసీఐ) గుర్తింపుతో పాటు యూజీసీ 12బీ గుర్తింపు కూడా కలిగి ఉంది. కొత్తగా వర్సిటీ సిగలో న్యాక్ గుర్తింపు చేరడం పట్ల వర్సిటీ అధ్యాపక, ఉద్యోగ, విద్యార్థి వర్గాలు సంతోషం వ్యక్త పరుస్తున్నారు. న్యాక్‌కి సంబంధించి సెల్ఫ్‌స్టడీ రిపోర్ట్ చైర్మన్‌గా వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు, కన్వీనర్‌గా ప్రస్తుత అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య వ్యవహరించగా ఐక్యూ ఏసీ(ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్)ఇన్‌చార్జ్‌గా డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య వ్యవహరించారు. ఈ గుర్తింపు వల్ల వర్సిటీకి రీసెర్చ్ ప్రాజెక్టులతోపాటు యూజీసీ నుంచి నిధులు తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందని అధికారవర్గాలు అంటున్నాయి. ఈ గుర్తింపుకు కృషి చేసిన ఏడీ జగపతిరామయ్య, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బందిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అరుణాచలం రవి, డీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు, డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య అభినందించారు.

తిరుపతిలో పొల్యూషన్ కంట్రోలు బోర్డు జోనల్ కార్యాలయం

బోర్డు ప్రతిపాదనను ఆమోదించిన ప్రభుత్వం

తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ పొల్యూషన్ కంట్రోలు బోర్డు జోనల్ కార్యాలయం తిరుపతిలో ఏర్పాటు కానుంది. ఇప్పటి వరకూ ప్రాంతీయ కార్యాలయం మాత్రమే వున్న తిరుపతిలో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు బోర్డు చేసిన ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటి వరకూ రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్టణం, కర్నూలు నగరాల్లో జోనల్ కార్యాలయాలున్నాయి. కర్నూలు జోనల్ కార్యాలయ పరిధిలో మొత్తం రాయలసీమ ప్రాంతం కవర్ అవుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో నెల్లూరు జిల్లా పరిధిలోని పరిశ్రమల్లో 65 శాతం పరిశ్రమలు తిరుపతి జిల్లా పరిధిలోకి చేరాయి. దానివల్ల అత్తివరం, మేనకూరు సెజ్‌లు కూడా తిరుపతి పరిధిలోకి వచ్చాయి. రెడ్ కేటగిరీకి చెందిన పరిశ్రమలు, నగరిలోని డైయింగ్ యూనిట్లు, ఫ్రూట్ క్యానింగ్ యూనిట్లు, శ్రీసిటీ సెజ్, డీటీజెడ్ తదితరాలన్నీ మునుపే తిరుపతి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వున్నాయి. కొత్తగా నెల్లూరు జిల్లా నుంచీ వచ్చి చేరిన పరిశ్రమల కారణంగా తిరుపతి జిల్లాలోకి 17 రకాల ప్రమాదకరమైన పరిశ్రమలన్నీ చేరినట్టయింది. వీటిని 450 కిలోమీటర్ల దూరాన వున్న కర్నూలు నుంచీ తరచూ రాకపోకలు సాగించి పర్యవేక్షించడం కష్టసాధ్యమని గుర్తించిన ఏపీ పొల్యూషన్ బోర్డు తిరుపతిలో కొత్తగా జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయడమే ఉత్తమమని భావించింది. ఆ మేరకు బోర్డు పాలకమండలి సమావేశంలో ప్రతిపాదనను ఆమోదించి అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. కొత్తగా భవన నిర్మాణం వంటివేవీ అవసరం లేదని, ఇప్పటికే తిరుపతిలో ప్రాంతీయ కార్యాలయం కోసం 25 సెంట్ల స్థలంలో రెండు సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్ సహా ఐదంతస్తుల భవనం కొత్తగా నిర్మించినందున ఆ భవనంలోనే జోనల్ కార్యాలయం కూడా నిర్వహించుకునే వీలుందని ప్రభుత్వానికి నివేదించింది. దీంతో కొత్తగా పోస్టులేవీ మంజూరు చేయకుండా వున్న సిబ్బందితోనే సర్దుబాటు చేసుకోవాలని సూచిస్తూ తిరుపతి కేంద్రంగా జోనల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో తిరుపతిలో త్వరలో జోనల్ కార్యాలయం ఏర్పాటు కానుంది.

కుమారధార తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

నేటి మధ్యాహ్నం 12 గంటల వరకే భక్తులకు అనుమతి

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో శనివారం నిర్వహించనున్న కుమారధార తీర్థ ముక్కోటికి టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఉదయ 5.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, చిన్నపిల్లలు, వృద్ధులకు అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది. గోగర్భం నుంచి పాపవినాశనం వరకు ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. ట్రాఫిక్ దృష్ట్యా ప్రైవేట్‌వాహనాల అనుమతిని రద్దుచేశారు. మార్గమధ్యంలో భద్రత, తాగునీరు, ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తుల కోసం అంబులెన్స్‌లు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. శుక్రవారం తిరుమలలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భద్రతా ఏర్పాట్లపై తిరుమల ఏఎస్పీ శివరామ రెడ్డి, వీజీవోలు నందకిశోర్, గిరిధర్, విజిలెన్స్ పోలీసు అధికారులు సమీక్షించారు.

స్కూల్ వ్యాన్ కిందపడి చిన్నారి దుర్మరణం



సాత్విక (ఫైల్ ఫొటో)

ఐరాల, ఫిబ్రవరి 23: స్కూల్ వ్యాన్ కిందపడి ఓ చిన్నారి దుర్మరణం చెందిన సంఘటన గూబలవారిపల్లెలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం దామలచెరువుకు సమీపంలోని గూబలవారిపల్లె చెందిన శ్రీహరి, లక్ష్మీదేవి దంపతులకు మోక్షశ్రీ, సాత్విక (5) ఇద్దరు సంతానం. శుక్రవారం ఉదయం మోక్షశ్రీని పాఠశాలకు పంపేందుకు అమ్మమ్మ రాజమ్మ స్కూల్ వ్యాను వద్దకు తీసుకొచ్చింది. వ్యానులోకి పాపను ఎక్కిస్తుండగా సాత్విక కూడా వచ్చింది. ఆ తర్వాత వ్యాను వెనుక చక్రం దగ్గరకు వెళ్లింది. ఈ విషయాన్ని అమ్మమ్మ, వ్యాను డ్రైవర్ గమనించలేదు. వాహనాన్ని ముందుకు నడపడంతో సాత్వికపైకి చక్రం ఎక్కేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై ఐరాల పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రేషన్‌కార్డు అడిగితే దాడి చేసిన వలంటీరు



గాయపడిన షేక్ షారుఖ్

చిట్టమూరు, ఫిబ్రవరి 23: తాను దరఖాస్తు చేసుకున్న రేషన్‌కార్డు ఏమైందని అడిగినందుకు వలంటీరు, అతడి సోదరులు విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచిన ఉదంతమిది. గాయపడ్డ ఆ వ్యక్తి పోలీసులను ఆశ్రయిస్తే అతడినే తప్పుబడుతూ భయపెట్టి సర్దుబాటు చేసి పంపిన ఈ ఘటన తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం తాడిమేడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... తాడిమేడుకు చెందిన షారూఖ్ ఆరునెలల క్రితం రేషన్‌కార్డు కావాలని సుమత్ అనే వలంటీరును అడిగాడు. రేషన్‌కార్డు లాగిన్ ప్రభుత్వం ఇంకా వదలలేదని రేషన్‌కార్డు ఇచ్చే సమయంలో తానే దరఖాస్తు చేస్తానని వలంటీరు చెప్పాడు. గురువారం రాత్రి ఇదే విషయమై షారుఖ్ వలంటీరును అడిగాడు. తనకు సంబంధం లేదని సచివాలయం వద్ద వెళ్లి అడగమని వలంటీరు సుమత్ చెప్పాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. అదే సమయంలో వలంటీరుతో పాటు అతడి సోదరులు ముగ్గురు షారూఖ్‌పై దాడిచేశారు. దీంతో షారూఖ్ తలపై బలమైన గాయమైంది. రక్తగాయాలతో షారూఖ్ చిట్టమూరు పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు బాధితుడిని భయపెట్టి ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి పంపినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై ఎస్ఐ చిన్నబలరామయ్యను వివరణ కోరగా వలంటీరును నిలదీసిన షారూఖ్‌దే తప్పని, సర్దుబాటు చేసి పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

తిరుమలలో పట్టుబడిన కొండ చిలువ



తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఓ భారీ కొండ చిలువ పట్టుబడింది. సేవాసదన్ వెనుకభాగంలోని అడవి నుంచి సుమారు 12 అడుగుల పొడవు కలిగిన కొండచిలువ జనసంచారంలోకి వచ్చింది. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని దాన్ని పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

అన్నార్తులే మోతగాళ్లు...?

● అన్నదాన కేంద్రంలో పనిచేయని లిఫ్టు ● భక్తుల చేతే మోయించిన వేడి పాత్రలు

● నిద్రావస్థలో ముక్కంటి ఆలయ ఇంజనీరింగ్ వ్యవస్థ



వంటశాల నుంచి భోజన పాత్రలను మోసుకెళ్తున్న భక్తులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో అన్నార్తులైన భక్తులే మోతగాళ్లుగా మారారు.ఆలయంలోని నిత్యాన్నదాన మండపంలో భోంచేయడం ఈశ్వర ప్రసాదాన్ని స్వీకరించడంగా భక్తులు భావిస్తుంటారు.ఇక్కడ రోజుకు సుమారు 5000మంది భక్తులకు అన్న ప్రసాదం సరఫరా చేసేలా ఏర్పాటు చేశారు. కింద సెల్లార్ లోని వంటశాలలో వంటకాలను సిద్ధం చేస్తారు.వంట గదిలో నుంచి వాటిని మొదటి అంతస్తుకు లిఫ్ట్ ద్వారా తరలించాలి. సుమారుగా 200 సార్లు వేడివేడి వంటకాలను పాత్రలతో పైకి చేర్చాలి. అలాగే ఖాళీ అయిన పాత్రలను కిందకు తరలించుకోవాలి. అసలే అన్నదాన సత్రంలో సిబ్బంది కొరత ఉంది. దానికి తోడు మూడు నెలల నుంచి లిఫ్టు తరచూ మొరాయిస్తూనే ఉంది. వారం రోజుల నుంచి గోడల నుంచి లీకేజీల సమస్యతో లిఫ్ట్ పూర్తిగా పనిచేయడంలేదు.అప్పటినుంచి అన్నదాన సిబ్బందిపై వేడి పాత్రలు తరలించే అదనపు భారం పడింది. భక్తుల రద్దీ సమయంలో త్వరితగతిన పాత్రలను మొదటి అంతస్తుకు చేర్చాల్సి ఉంటుంది. దాంతో సిబ్బంది అన్నార్తులుగా వచ్చిన భక్తులనే సాయం పట్టండంటూ ప్రాధేయ పడాల్సి వస్తోంది. భారీ వేడి పాత్రలను భక్తుల సహాయంతో మొదటి అంతస్తుకు తీసుకెళుతున్నారు.

అదుపు తప్పితే ఎంత అప్రతిష్ఠ...?

వంట పాత్రలు బరువుతోపాటు వేడిగా కూడా ఉంటాయి. వాటిని భక్తులు మెట్ల మార్గంలో తీసుకెళ్లడం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది.పాత్రలు అదుపుతప్పి పొరపాటున భక్తులపై పడితే శరీరం తీవ్రంగా గాయపడే ప్రమాదం వుంది. ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన భక్తులు ఎవరైనా ప్రమాదవశాత్తు గాయపడితే ఎంతటి అప్రతిష్ఠను మూట కట్టుకోవాల్సి వస్తుందో అర్థం కాని పరిస్థితి. ఆలయంలో పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ వ్యవస్థ ఉంది. అయినా చిన్న లిఫ్ట్ సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఆదాయం చేకూరే పనుల్లో తప్ప ఇటువంటి వాటిపై ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ చూపరని ఆలయ ఉద్యోగులే బాహాటంగా విమర్శిస్తున్నారు.



పశువులకు దాణా పెడుతున్న నారాభువనేశ్వరి

వరసిద్ధుడి సేవలో భువనేశ్వరి

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఆమె వెంట మాజీమంత్రి అమర్నాథరెడ్డి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఎమెల్సీ దొరబాబు, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు భేష్



హోంగార్డుకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న మహేష్‌కుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 23: శాంతి భద్రతల విషయంలో హోంగార్డుల సేవలు భేష్ అని కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన హోంగార్డు దర్బార్‌లో ఆయన ప్రసంగించారు. చిత్తశుద్ధితో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. ఏఆర్ డీఎస్పీలు ఇలియాస్ బాష, మహబూబ్ బాషా, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.20లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం

ఒకరి అరెస్టు, ద్విచక్రవాహనం సీజ్



నిందితుడు, మద్యాన్ని మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 23: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.1.20 లక్షల మద్యంతో పాటు ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వివరాలను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఉలసయ్యతో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం మీడియాకు తెలియజేశారు. కొన్ని రోజులుగా మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా పెట్టారు. శుక్రవారం పోలీసులకు వచ్చిన సమాచారంతో ఇరువారం బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. టీపీనాయుడు వీధికి చెందిన అన్వర్(27)ను పట్టుకోగా.. పాండ్యా, లడ్డూలు పరారయ్యారు. పట్టుబడిన నిందితుడి నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం, రూ.30వేల విలువైన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పరారీలోని మిగతా ఇద్దరినీ త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న రెండో పట్టణ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మురళి



సోమల, ఫిబ్రవరి 23: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మాటూరి మురళీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ఉద్యమబాటలో పయనిస్తానన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనకోసం కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 27న తిరుపతిలో జరిగే ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కదలిరావాలన్నారు. మురళీ నియామకం పట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మందా రామనాథం, మండల అధ్యక్షుడు ప్రకాశ్, లక్ష్మీపతి అభినందనలు తెలిపారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థనలు



శాంతిపురం, ఫిబ్రవరి 23 : టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని శుక్రవారం రాళ్ళబూదుగూరు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 2024ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు లక్ష మెజారిటీతో గెలుపొంది, రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని ప్రార్థించారు. ముసిం సోదరులతో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడారు. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముసింలకు ప్రత్యేక స్థానం కల్పించి పలు సంక్షేమ పథకాలు అందించిన ఘనత నారా చంద్రబాబుదేనన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నేతలు జాకిర్, యూనిట్ ఇంచార్జి ఆర్ఎస్ మణి, కుమార్ తదితరలు పాల్గొన్నారు.

సీఎం పర్యటన పనులు ముమ్మరం

శాంతిపురం, ఫిబ్రవరి 23 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శాంతిపురం మండల పర్యటనకు అధికారులు, వైసీపీ నేతలు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మఠం వద్ద సీఎం బహిరంగ సభ ఉంటుంది. అందుకు కావాల్సిన పనులను అధికారులు శరవేగంగా చేపడుతున్నారు. మఠం సమీపంలోని జూనియర్ కళాశాల వద్ద చేపడుతున్న హెలిప్యాడ్ పనులను ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పరిశీలించారు.కార్యక్రమంలో వైసీపీ నేతలు మురుగేష్, శ్యామరాజు, పెద్దన్న, వీరభద్రప్ప, శ్రీరాములు, విద్యాసాగర్, ఏవి జయరాం, మురళీ, చంద్ర పాల్గొన్నారు.

వైభవంగా గిరిజా కల్యాణం



పలమనేరు, ఫిబ్రవరి23 : పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం గిరిజా కల్యాణం వైభవంగా నిర్వహించారు. గిరిజా కల్యాణానికి అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరయ్యారు. గిరిజా కల్యాణానికి తహసీల్దార్ అమరేంద్రబాబు, జే.సరళ దంపతులు, ఆర్.బి.సి ఎంటర్‌ప్రైజస్, మధురస్వర ఆర్కెస్ట్రా, ఆర్. రంగయ్యశెట్టి అండ్‌సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ గంటేవీరభద్ర, సభ్యులతోపాటు ఎండోమెంట్ సిబ్బంది భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడి తోటలకు నిప్పు



చౌడేపల్లె, ఫిబ్రవరి 23: మండలంలోని చెడుగుట్టపల్లెకు వెళ్లే మార్గంలో మహేష్ బాబు, హరిబాబులకు చెందిన మామిడి తోటలకు శుక్రవారం మధ్యాహ్నం నిప్పంటుకుంది. స్థానికులు, తోట యజమానులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు. సుమారు రూ.20వేలు వరకు రైతులకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

పశువైద్యాధికారికి ఘన సన్మానం



పుంగనూరు, ఫిబ్రవరి23: వనమలదిన్నె పశువుల ఆసుపత్రిలో పనిచేస్తున్న పశువైద్యాధికారి కల్యాణ్ పదోన్నతిపై బదిలీ కావడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఏడీ కార్యాలయంలో ఆయనను శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పశువర్ధకశాఖ సహాయ సంచాలకులు మనోహర్ మాట్లాడుతూ రైతులు అందుబాటులో ఉంటూ మంచి సేవలు అందించారని కొనియాడారు. అన్నమయ్య జిల్లా బురకాయలకోటకు పశువర్ధక సహాయ సంచాలకులుగా బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 : మండలంలో ప్రభుత్వనిధులతో పూర్తి కాబడిన పలు అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప ప్రారంభించారు. బేలుపల్లె, పిచ్చిగుండ్లపల్లె, కమ్మనపల్లె, ధర్మపురి, చప్పిడిపల్లె, నెల్లిపట్ల, పాతూరునత్తం, కడపనత్తం,వెంగంవారిపల్లె, బైరెడ్డిపల్లె, కొత్తఇండ్లు, లక్కనపల్లె, గొల్లచీమనపల్లె, కంభంపల్లె, గడ్డూరు, తీర్థం, దేవదొడ్డి గ్రామాల్లో గ్రామసచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, నాడు-నేడు కింద నిర్మించిన అదనపు తరగతి గదులు, పూర్తయిన రహదారులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జడ్పీటీసీ కేశవులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 : పట్టణంలోవున్న శేషాద్రి స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు ధనం జయగౌడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ చిరంజీవిచే హరికథ, భజనలు, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

బెలెన్స్ ఆస్పత్రి ఉపకేంద్రం ప్రారంభం

పుంగనూరు : భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెలో శుక్రవారం బెలెన్స్ కార్పొరేట్ ఆసుపత్రి ఉపకేంద్రాన్ని ముడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్, ఆసుపత్రి డైరెక్టర్ మంజునాథ్ ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందివ్వనున్నట్లు ఆసుపత్రి డైరెక్టర్లు మంజునాథ్, కిషోర్‌కుమార్ తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉన్నత భవిష్యత్తు : ద్రావిడ వీసీ

కుప్పం, ఫిబ్రవరి 23: పట్టుదల, క్రమశిక్షణతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని ద్రావిడ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కొలకలూరి మధుజ్యోతి అన్నారు. కుప్పం పబ్లిక్ స్కూల్ 21వ, కుప్పం జూనియర్ కళాశాల 16వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్, కుప్పం జూనియర్ కళాశాల ఛైర్‌పర్సన్ శాంతానాగరాజ్‌లు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విద్యార్థులకు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కుప్పం పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వి.దమయంతి, కుప్పం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంటీ.సుప్రియ, సీఈవో నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న వీసీ తదితర ప్రముఖులు

హేతుబద్ధీకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలి

పలమనేరు, ఫిబ్రవరి23 : గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ జీఓ లో పలు లోపాలు ఉన్నందున ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని వివిధ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పలమనేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో 11 పోస్టులు మంజూరుచేసి ప్రతిపోస్టుకు ప్రత్యేకంగా వేరు జాబ్ ఛార్టు జారీ చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఖాళీ ఉన్న పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయకుండా వాటిలో కొన్ని పోస్టులను వేరొక సచివాలయానికి సర్దుబాటు ద్వారా బదిలీ చేయడం తప్పుడు విధానమన్నారు. ఈ విధానం వలన ఒక్కో సచివాలయంలో ఒక్కోవిధమైన పరిపాలన అమలు చేసినట్టు అవుతుందన్నారు. అంతేకాక ఎన్నికల వేళ ఉద్యోగుల నెత్తిన బలవంతపు బదిలీలు రుద్దడం తగదన్నారు. బదిలీలు కోరుకొంటున్న సచివాలయ ఉద్యోగులకు బదిలీలు కల్పించి జీఓ నంబరు1ని విడుదల చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు తాలూకా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి, జిల్లా అధ్యక్షులు రమణ, సంఘ నాయకులు బింది, రాజు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి

సీఐటీయూ నాయకుల నిరసన

పలమనేరు, ఫిబ్రవరి23 : పలమనేరు సీఐటీయూ కార్యాలయం వద్ద శుక్రవారం సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. పంటలకు గిట్టుబాటు ధర కోసం రైతులు చేస్తున్న పోరాటానికి కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అమానవీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిధరగుప్తా పేర్కొన్నారు. రైతులకు సంఘీభావం తెలుపుతూ చేపట్టిన ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడుతూ రైతుల పోరాటంపై పోలీసుల కాల్పుల్లో యువరైతు శుభకరన్‌సింగ్ మృతిచెందడం బాధాకరమన్నారు. మరో రైతు గుండెపోటుతో మృతి చెందడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్‌వర్కర్ సుధాకర్, చందు, గుణ మహిళా సంఘం ధనమ్మ, లక్ష్మి, రైతు సంఘం, ఈశ్వర, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.



పలమనేరులో సీఐటీయూ నాయకుల నిరసన

సేవాగడ్ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం ఎంపిక

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి23: మండలంలోని ఏడు తాండాల వారి కోసం ఏర్పాటు చేసిన సేవాగడ్ అభివృద్ధి నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బంజార కులస్తులు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎం. ఈశ్వర్ నాయక్, కార్యదర్శిగా రెడ్డినాయక్, కోశాధికారిగా గోపాల్‌నాయక్, ఉపాధ్యక్షులుగా బాలాజీనాయక్, శంకర్‌నాయక్, ఎం.శ్రీరాములునాయక్, సహాయ కార్యదర్శులుగా బి. శ్రీరాములునాయక్, నాగరాజునాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజునాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శంకర్‌నాయక్, మనినాయక్, చిన్నరెడ్డెప్పనాయక్, నరసింహులునాయక్, వాసునాయక్, మునిరత్నంనాయక్, శివాజీనాయక్, నాగరాజ్‌నాయక్‌లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ఏడు తాండాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



సేవాగడ్ అభివృద్ధి నూతన కమిటీ సభ్యులు

పలమనేరు సంతలకు వేలం

గతేడాది కంటే పెరిగిన ఆదాయం

పలమనేరు, ఫిబ్రవరి23 : పలమనేరు మున్సిపాలిటీలో దినసరి, వారపు కూరగాయల సంత తదితర వాటికి శుక్రవారం నిర్వహించిన వేలం పాటల్లో గత సంవత్సరం కంటే ఆదాయం పెరిగిందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటల్లో వారపు సంత గత సంవత్సరం రూ. 10,71,000 పలుకగా ఈ ఏడాది రూ. 12,75,500, దినసరి కూరగాయల సంత గతసంవత్సరం రూ.16,25,400 పలుకగా ఈ ఏడాది రూ.17,98,000, నీళ్లకుంట చెరువులో చేపల పెంపకానికి గత సంవత్సరం రూ.18,400 పలుకగా ఈ ఏడాది రూ. 19,000, చింతచెట్లు గత సంవత్సరం ఫలసాయం లేనందున వేలం పాటలు నిర్వహించలేదు. చింతచెట్లుకోసం ఈసారి సర్కారువారి పాటగా అధికారులు రూ.15,000 నిర్ణయించారు. బొమ్మిదొడ్డి చెరువు చేపల పెంపకానికి గత సంవత్సరం రూ. 3,00,000 పలుకగా వేలం పాటల్లో చింతచెట్లు, బొమ్మిదొడ్డి చేపల పెంపకం కోసం గుత్తేదారులు ఆశక్తిచూపలేనందున వేలం పాటలు పాడలేదని అధికారులు తెలిపారు.



కమిషనర్ ఛాంబర్‌లో వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

వేలం పాటల ద్వారా వి.కోటకు రూ. 28.64 లక్షల ఆదాయం

వి.కోట, ఫిబ్రవరి 23: వి.కోట మేజర్ గ్రామపంచాయతీకి వివిధ రకాల మార్కెట్‌లకు సంబంధించి జరిపిన వేలంపాటలలో రూ. 28.64 లక్షల ఆదాయం సమకూరినట్లు సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మి తెలిపారు. చిత్తూరు డీపీవో లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలంలో వారపు కూరగాయల మార్కెట్ రూ.2.56 లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.4.23లక్షలు, ప్రైవేటు బస్టాండు రూ.10.51 లక్షలు, పశువుల సంత రూ.4.51 లక్షలు, గొర్రెలు, మేకలు సంత రూ.4.68లక్షలు, కమ్యూనిటీ లెట్రిన్‌లు రూ.2లక్షలు మేరకు హెచ్చు పాటదారులు దక్కించుకున్నారు. ఈవో యాదవపతి పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 23 : పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేపాకులతో తోరణాలు కట్టి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పలమనేరు మార్కెట్ కమిటీ వాణిజ్య సముదాయం కోసం 11ఏళ్లుగా నిరీక్షణ

పలమనేరు, ఫిబ్రవరి23 : పలమనేరులో జాతీయ రహదారి పక్కనే మార్కెట్ కమిటీ వద్ద వాణిజ్య సముదాయం నిర్మిస్తామని చెప్పి 2011లో అప్పటి పాలక వర్గం, మార్కెట్ అధికారులు ఒక్కొక్కరి వద్ద రూ. 4లక్షల చొప్పున వసూలు చేసి ఇప్పటి వరకు గదులు నిర్మించకపోవడంతో 11 మంది ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. మార్కెట్ కమిటీ పాలక వర్గాలు మారుతున్నాయే కానీ గుడ్‌విల్ కింద గదుల కోసం రూ. 4లక్షలు చెల్లించిన లబ్ధిదారుల గురించి పట్టించుకున్న నాథుడే లేరు. అప్పట్లో రూ. 4లక్షల కోసం అప్పులు చేసి, ఇంట్లో మహిళల బంగారు తాకట్టుపెట్టి డిపాజిట్లు చెల్లించామని, గదులు నిర్మించకపోవడంతో తాము తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాలక వర్గం మారిన ప్రతిసారి తాము వెళ్లి తమ గదుల నిర్మాణం గురించి అడిగితే ఇదిగో కట్టిస్తాం, అదిగో కట్టిస్తాం అంటూ వాయిదాలు వేసి పంపిస్తున్నారే గాని గదుల నిర్మాణం మాత్రం చేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి ఇకనైనా వెంటనే తమకు గదులు నిర్మించి ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

హంద్రీ-నీవా కాలువ పనుల పరిశీలన



రామకుప్పం, ఫిబ్రవరి 23: మండలంలోని హంద్రీ-నీవా కాలువ గేట్ ఏర్పాటు పనులను, రాజుపేటలో సీఎం పర్యటన ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్సీ భరత్, వైసీపీ మండల కన్వీనర్ విజలాపురంబాబు, కో-కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డిలు పరిశీలించారు. మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి శనివారం మిట్టపల్లె వద్ద రైతుభరోసాకేంద్రం భవన ప్రారంభోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. చివరగా రామకుప్పం పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన డీసీసీ బ్యాంకు శాఖను ప్రారంభిస్తారన్నారు.

అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం



రామకుప్పం, ఫిబ్రవరి 23: రామకుప్పంలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డిలు కోరారు. శుక్రవారం వారు అన్నక్యాంటీన్‌లో ప్రజలు భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నక్యాంటీన్‌లో ప్రజలకు ప్రతి రోజు మధ్యాహ్నం 12:45 నుంచి 2గంటల వరకు భోజనాలను అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, గంట్లప్ప గౌడు, సీతాపతి, కృష్ణానాయక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 27న పాలీసెట్

కుప్పం, ఫిబ్రవరి 23: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రవేశాలకోసం ఉద్దేశించిన పాలీసెట్ - 2024ను ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించనున్నట్లు కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. పాలీసెట్ పరీక్షకు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న, లేదా ఇప్పటికే ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. దరఖాస్తులను సమర్పించడానికి ఏప్రిల్ 5వ తేదీదాకా అవకాశం ఉన్నదన్నారు. ప్రస్తుతం 10వ తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు దగ్గరగా ఉండే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణతోపాటు స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగానే ఇస్తామని ఆయన చెప్పారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్య శిబిరం



కుప్పం రూరల్, ఫిబ్రవరి 23: మల్లానూరు పంచాయతీ పరిధిలోని పొన్నాంగూరు గ్రామంలో శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 120 మందికి వైద్యం అందించినట్లు వైద్యుడు డాక్టర్ మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఝాన్సీరాణి, పార్థసారథి, గణేశ్, మణికంఠ పాల్గొన్నారు.

పాల ఏకిరి సాధికార సమితి కో ఆర్డినేటర్‌గా రెడ్డిశేఖర్



సోమల, ఫిబ్రవరి 23: టీడీపీ పాల ఏకిరి సాధికార సమితి మండల కమిటీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఎన్.రెడ్డి శేఖర్ నాయుడును నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రెడ్డిశేఖర్ నాయుడు మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



సోమల, ఫిబ్రవరి 23: సోమల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాత కార్యక్రమాలు ప్రజలకు ఆకట్టుకున్నాయి. శుక్రవారం సోమల, నంజంపేట పరిధిలోని గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు మ్యాజిక్ షోల ద్వారా అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ కె.బాలాజీ మాట్లాడుతూ బ్యాంకు సేవలు, పీఎం సురక్ష బీమా, జీవన జ్యోతి బీమా, సామాజిక భద్రత పథకాలు, పొదుపు పథకాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కమల్ ఉద్దీన్, కళాజాత ఆర్గనైజర్ మహేశ్, రాఘవేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 : అటవీప్రాంతం నుంచి దారితప్పి జనారణ్యంలోకి వచ్చిన ఓ జింక కుక్కలదాడిలో మృతిచెందిన ఘటన శుక్రవారం బైరెడ్డిపల్లె మండలంలో జరిగింది. నీటి కోసం గడ్డిండ్లు గ్రామ సమీపంలోకి వచ్చిన జింకను కుక్కలు వెంటబడి దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో ఆ జింక మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది వెంటనే ఆ గ్రామానికి చేరుకుని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి మసెమ్మ జాతర



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి23: ఆరడిగుంట పంచాయతీ కొండచర్ల కురప్పల్లె గ్రామంలో వెలసిన మసెమ్మ జాతర శని, ఆదివారాల్లో వైభవంగా జరగనుంది. మండలంలోని 30 గ్రామాల ప్రజలు ఈ జాతరను చేయనున్నారు. శనివారం రాత్రి అమ్మవారిని ఊరేగించి జంతుబలులు సమర్పిస్తారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామ చివరలో అమ్మవారిని నిలిపి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. ఈ జాతరకు మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఆదివారం రాత్రి అమ్మవారిని ఊరేగించి నిమజ్జనం నిర్వహిస్తారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఫిబ్రవరి23: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. వేకువ జామున వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి అన్నదానం నిర్వహించారు.

వైష్ణవి దేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, ఫిబ్రవరి23: మండలంలోని పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ నిర్వహకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పెండింగు జీతాలు చెల్లించాలి

నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా



నగరి, ఫిబ్రవరి 23: పెండింగులోని ఐదు నెలల జీతాలను చెల్లించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ, సీపీఐ నాయకులతో కలిసి శుక్రవారం నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కోదండయ్య, సీపీఐ నాయకుడు వేలన్ మాట్లాడారు. జీతాలివ్వకుంటే కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. పెండింగులోని జీతాలతోపాటు ఈఎస్ఐ కార్డులను కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయకుమార్, మురళి, శేఖర్, సతీష్, సుబ్రహ్మణ్యం, రాము, మురుగమ్మ, పార్వతి, మోహన, కుట్టి, చిన్నరసు తదితరులు పాల్గొన్నారు.

210వ రోజు అన్నదానం



గుడిపాల, ఫిబ్రవరి 23: మండలంలోని అన్న క్యాంటీన్‌లో శుక్రవారం 210వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లె రవినాయుడు భోజనం వితరణ చేశారు. మాజీ సర్పంచ్ రవి నాయుడు, నాయకులు మురళీనాయుడు, పళని, సురేష్, మోహన్, గణపతి, షణ్ముగం, గోపి, సాంబశివన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో...



బంగారుపాళ్యం: బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో శుక్రవారం కూడా అన్నదానం చేశారు. ఎన్‌పీ అమృతమ్మ, ఎన్‌పీ భాస్కర్ నాయుడు మునిమనవరాలు ఐర్య జన్మదినాన్ని పురస్కరించుకుని భోజనం వితరణ చేశారు. నాయకులు జనార్దన్ గౌడ్, సూరి నాయుడు, రమేష్, సుదర్శన్ నాయుడు, శివ, లోకనాధం నాయుడు పాల్గొన్నారు.

రుణం తీసుకున్నవారు ఈకేవైసీ చేయించుకోవాలి

గుడిపాల, ఫిబ్రవరి 23: సింగిల్ విండో సొసైటీలో రుణాలు తీసుకున్న వారు, డిపాజిట్ దారులతోసహా ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీఈవో సెల్వం అన్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, 1బీ అడంగళ్ నకళ్లను మండలకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మహాశివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 23: ఎగువకన్నికాపురం అటవీ ప్రాంతంలో ఉన్న మరకతవల్లి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయ మహోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి ఆవిష్కరించారు. మార్చి ఏడు నుంచి తొమ్మిదో తేదీవరకు ఉత్సవాలు జరగనున్నాయి. గణపతిరెడ్డి, దయాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

నగరి, ఫిబ్రవరి 23: నగరిలో శుక్రవారం వీధి నాటకాల ద్వారా ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచనలతో జిల్లా ఎయిడ్స్ నివారణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశంతో నగరిలో స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆర్ముగం, కలైవాణి, ఇందుమతి, గుణసుందరి, శీలారాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు అన్యాయం: డీసీసీ అధ్యక్షుడు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 23: యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ చేపట్టిన 'చలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని పోలీసులతో అడుగడుగునా అడ్డుకుంటూ తమ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తెలిపారు. శుక్రవారం వెదురుకుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, ఇతర నాయకులను అరెస్టులు చేయడం, గృహ నిర్బంధాలంటూ నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ పాలనకు చరమగీతం పాడి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు

- విద్యార్థులకు డీఈవో సూచన



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీఈవో దేవరాజులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23: సమయాన్ని వృథా చేయొద్దని విద్యార్థులకు డీఈవో దేవరాజులు సూచించారు. శుక్రవారం ఆయన కాణిపాకం జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఎంఈవో రుష్యేంద్రబాబు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు సోమశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన: ఎంపీపీ

నింద్ర, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ ఆవరణంలో శుక్రవారం నిర్వహించినా జాబ్‌మేళాకు స్పందన లభించిందని ఎంపీపీ దీప తెలిపారు. ఎంఎస్‌పీఎంపురం వద్ద నూతనంగా నిర్మించిన అమ్మయుప్పన్ టెక్స్‌టైల్స్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించారని చెప్పారు. కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' సక్సెస్: టీఎన్ఎస్ఎఫ్



సంతకాలు పెడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 23 : 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమం విజయవంతమైందని టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభు తేజ చెప్పారు. శుక్రవారం పీసీ ఆర్ సర్కిల్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓటు హక్కు కల్గిన ప్రతి విద్యార్థీ మొదటి ఓటును చంద్రబాబుకు వేయాలని కోరారు. సందీప్, గౌస్, శశి, తేజ, రాజేష్, భరత్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమంపై శ్రద్ధెక్కడ?: బీజేపీ



ప్రజాపోరులో పాల్గొన్న బీజేపీ నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా సంక్షేమంపై శ్రద్ధ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు విమర్శించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం దుర్గా హోటల్ సర్కిల్‌లో బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరచౌదరి, దుర్గా రామకృష్ణలతో కలిసి ప్రసంగించారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమవిగా చెప్పడం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు బాబు, రవికుమార్, గురుగణేష్, మోహన్‌నాయుడు, చిట్టిబాబు, షణ్ముగం, పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుంటిపల్లిలో ఆరోగ్య సురక్ష

పెనుమూరు, ఫిబ్రవరి 23: గుంటిపల్లి సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష నిర్వహించారు. 297మంది వైద్యం చేయించుకున్నారని ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. డాక్టర్లు హర్షవర్ధన్, మీనాసయ్యద్, రాజశేఖర్, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం



వళ్లిమలైలో తేరును లాగుతున్న భక్తులు

గుడిపాల, ఫిబ్రవరి 23: ఆంధ్ర సరిహద్దులోని వళ్లిమలై ఆలయంలో వెలసి ఉన్న వళ్లీ సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం శుక్రవారంతో వైభవంగా ముగిసింది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. రథాన్ని లాగడానికి తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శనివారం స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.





ఎస్ఆర్‌పురం మండలం గంగమ్మగుడి గ్రామంలో టీడీపీ శ్రేణులకు నారా భువనేశ్వరి అభివాదం

ఆలస్యమైనా.. నీరాజనం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 23: చిత్తూరు నగర శివారు ప్రాంతంలోని బ్యాన్స్ హోటల్‌లో నారా భువనేశ్వరి గురువారం రాత్రి బసచేశారు. ఉదయం కాణిపాకం వెళ్లి వరసిద్ధుడిని దర్శించుకున్నారు. కాణిపాకం వస్తున్నారని తెలిసి అక్కడి ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ కారణంతో చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామానికి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఆమె రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలైంది. ఆలస్యమైనప్పటికీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో మహిళలు మండుటెండలో కూడా వేచి ఉండిమరీ భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్ బాబు, రఘు, మేషాక్, మంజూష్, దేవరాజులునాయుడు, మనోహర్‌నాయుడు, గురేష్, చల్లా, అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మగుడి గ్రామంలో జనమే జనం

శ్రీరంగరాజపురం: గంగమ్మగుడి గ్రామానికి భువనేశ్వరి వస్తున్నారని తెలియడంతో మహిళలు, టీడీపీ శ్రేణులు, జనం తండోపతండాలుగా చేరుకున్నారు. దీంతో ఆ గ్రామంలో జనమే జనంగా కనిపించారు. పార్టీ శ్రేణులు, అభిమానుల్లో పండుగ వాతావరణం నెలకొంది. జన నీరాజనం పలికారు.

చిరునవ్వుతో పలుకరిస్తూ...

గంగమ్మగుడి గ్రామానికి చేరుకున్న నారా భువనేశ్వరి.. జనాన్ని, నాయకులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. స్వాగతించిన సమయంలోనూ, వీడ్కోలు సందర్భంలోనూ భువనేశ్వరి అందరినీ చిరునవ్వుతో పలుకరిస్తూ.. అభివాదం చేశారు. దీంతో ఆమె కరచాలనం కోసం జనం ఎగబడ్డారు.

స్వాగతించడానికి ఎదురుచూపులు

భువనేశ్వరిని స్వాగతించడానికి గంగమ్మగుడి గ్రామానికి చేరుకున్న జనం, కార్యకర్తలు, నాయకులు ఎదురుచూశారు. నిర్ణీత సమయానికన్నా 1.30 గంటలు ఆలస్యంగా వచ్చినా జనం మాత్రం అక్కడే వేచి ఉండి ఆమెకు ఘన స్వాగతం పలికారు.

ఈ క్రమంలో చంద్రబాబుకు జేజేలు పలికారు. చంద్రబాబు సీఎం అంటూ నినాదాలు చేశారు. స్వాగత సమయంలో పూల వర్షం కురిపించారు. మంగళ హారతులు పట్టారు. భువనేశ్వరి రాకతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చింది. ఎస్ఆర్‌పురం టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు, నాయకులు పైనేని ధనంజయులునాయుడు, వేమ నాయుడు, సిద్ధయ్యశెట్టి, రాజశేఖర్‌నాయుడు, దామునాయుడు, ఎస్.కుమార్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన అరుణ



పెనుమూరు, ఫిబ్రవరి 23: మజీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ శుక్రవారం కలిశారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్‌పురం మండలంలో పర్యటించిన ఆమెను కలిసి చంద్రబాబు దంపతులున్న చిత్రపటాన్ని బహూకరించారు.

వరసిద్ధుడి ఆలయం వద్ద చలువ పందిళ్లు



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వేసవి దృష్ట్యా భక్తుల కోసం వరసిద్ధుడి ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం చుట్టూ సీసీ రోడ్డు ఉండటంతో ఎండకు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

26 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 23: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ థర్డ్ డిగ్రీ విద్యార్థులకు ఈనెల 26 నుంచి మార్చి రెండో తేదీ వరకు 5వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కో-ఆర్డినేటర్ మీరాసాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత పోర్టల్‌లో హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు.

నేడు కలెక్టర్ ముందుకు 'మినహాయింపు' టీచర్లు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 23: సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరే టీచర్లు పరిశీలన నిమిత్తం శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముందు విధిగా హాజరు కావాలి. ఈ మేరకు కలెక్టరేట్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శివయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల మినహాయింపునకు గల కారణాలు స్పష్టంగా ఉండాలని సూచించారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 23: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివ శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు ఎన్నికల్లో తాను కాంగ్రెస్ తరపున పలమనేరు అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు చెప్పారు. ఏపీసీసీ మాజీ కార్యదర్శి పరదేశి, నాయకులు భాస్కర్‌రెడ్డి, రమణప్ప, నాగరాజు, రామప్ప, టిప్పుసుల్తాన్, సర్దార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 : అటవీప్రాంతం నుంచి దారితప్పి జనారణ్యంలోకి వచ్చిన ఓ జింక కుక్కలదాడిలో మృతిచెందిన ఘటన శుక్రవారం బైరెడ్డిపల్లె మండలంలో జరిగింది. నీటి కోసం గడ్డిండ్లు గ్రామ సమీపంలోకి వచ్చిన జింకను కుక్కలు వెంటబడి దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో ఆ జింక మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది వెంటనే ఆ గ్రామానికి చేరుకుని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మామిడి తోటలకు నిప్పు

చౌడేపల్లె, ఫిబ్రవరి 23: మండలంలోని చెడుగుట్టపల్లెకు వెళ్లే మార్గంలో మహేష్ బాబు, హరిబాబులకు చెందిన మామిడి తోటలకు శుక్రవారం మధ్యాహ్నం నిప్పం టుకుంది. స్థానికులు, తోట యజమానులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు. సుమారు రూ.20వేలు వరకు రైతులకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.



కార్వేటినగరం మండపం వీధిలో టీడీపీ కార్యాలయం ఎదురుగా 150 అడుగుల చంద్రబాబు కటౌట్‌ను ఆయన సహచర విద్యార్థి కొండూరు త్యాగరాజు ఏర్పాటు చేశారు. - కార్వేటినగరం

పీసీసీ ఓబీసీ కార్యదర్శిగా గోపీగౌడు నియామకం



చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 23: పీసీసీ ఓబీసీ కార్యదర్శిగా గోపీగౌడును నియమిస్తూ ఓబీసీ చైర్మన్ వెంకట రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో డీసీసీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. తనకు ఈ పదవి రావడానికి కారణమైన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు, జంగా గౌతంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే టికెట్ ఎవరికిచ్చినా మద్దతిస్తా: డీకే తేజస్విని



చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 23: చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఎవరికిచ్చినా మద్దతిస్తానని దివంగత ఎంపీ డీకే ఆదికేశవులు కుమార్తె డీకే తేజస్విని స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. ఇన్నాళ్లూ తాను తెరవెనుక ఉండి తన తండ్రి, తల్లి గెలుపునకు కృషిచేశానని చెప్పుకొచ్చారు. 2014లో చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా, 2019లో రాజంపేట ఎంపీ అభ్యర్థిగా తన తల్లి సత్యప్రభ పోటీ చేయగా ఆ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నానన్నారు. తల్లిదండ్రుల మరణానంతరం ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని తెలిపారు. తాను చిత్తూరు ఇంటి ఆడపడుచునని, తమ కుటుంబాన్ని ప్రజలు బాగా ఆదరిస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు యువతకు ఆదర్శవంతమైన నాయకులని అన్నారు.

వైభవంగా పులిగుండు గిరిప్రదక్షిణ



శేష వాహనంపై పార్వతీపరమేశ్వరులు

పెనుమూరు, ఫిబ్రవరి 23: పులిగుండు శివాలయంలో వెలసిన పార్వతీపరమేశ్వరుల ఆలయంలో పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అర్చకులు ఉదయం వివిధ రకాల అభిషేకాలతో పుష్పాలంకరణచేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను శేష వాహనంపై అలంకరించి.. కొత్తరోడ్డు, రాణా వేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణగా స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. వందలాది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవింద రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 27న పాలిసెట్

కుప్పం, ఫిబ్రవరి 23: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రవేశాలకోసం ఉద్దేశించిన పాలిసెట్ - 2024ను ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించనున్నట్లు కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. పాలిసెట్‌కు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న, లేదా ఇప్పటికే ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. దరఖాస్తులను సమర్పించడానికి ఏప్రిల్ 5వ తేదీదాకా అవకాశం ఉన్నదన్నారు. ప్రస్తుతం 10వ తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు దగ్గరగా ఉండే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణతోపాటు స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగానే ఇస్తామని ఆయన చెప్పారు.

నేటినుంచి మసెమ్మ జాతర

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి23: ఆరడిగుంట పంచాయతీ కొండచర్ల కురప్పల్లె గ్రామంలో వెలసిన మసెమ్మ జాతర శని, ఆదివారాల్లో వైభవంగా జరగనుంది. మండలంలోని 30 గ్రామాల ప్రజలు ఈ జాతరను చేయనున్నారు. శనివారం రాత్రి అమ్మవారిని ఊరేగించి జంతుబలులు సమర్పిస్తారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామచివరలో అమ్మవారిని నిలిపి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. ఈ జాతరకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఆదివారం రాత్రి ఆమ్మవారిని ఊరేగించి నిమజ్జనం నిర్వహిస్తారు.

సమస్యల ఊసెత్తని ప్రజాప్రతినిధులు

తూతూమంత్రంగా బంగారుపాళ్యం మండల సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ అమరావతి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 23: గ్రామాల్లో పలు సమస్యలు పడకేసినా.. ఒక్క ప్రజాప్రతినిధి కూడా వాటిని లేవనెత్తకుండా తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశాన్ని ముగించేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అమరావతి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొందరు సభ్యులు డుమ్మాకొట్టారు. హాజరైన కొందరు ప్రజాప్రతినిధులూ కుర్చీలకే పరిమితమయ్యారు. అధికారులు మాత్రం తమశాఖల గురించి చర్చించి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్,వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, దత్తాత్రేయ రెడ్డి, ఎల్లప్ప, అమర, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో శివశంకర్, మండల ప్రత్యేక అధికారి ఆసీఫ్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ ఆపాలి

ఉద్యోగ సంఘాల డిమాండ్

చిత్తూరు, ఫిబ్రవరి 23: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ జీవోలో పలు లోపాలుండటంతో వెంటనే ఆ ప్రక్రియను నిలుపుదల చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఎన్జీవో భవనంలో సంఘం అధ్యక్షుడు కేవీ రాఘవులు, జనరల్ సెక్రటరీ వీకే రఘు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి మహేష్, జిల్లా కార్యదర్శి రవీంద్రబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ జ్యోతీశ్వర ప్రసంగించారు. ప్రతి సచివాలయంలో 11పోస్టులను మంజూరు చేసి, వేర్వేరు జాబ్‌చార్ట్ జారీచేసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా వేరొక సచివాలయానికి సర్దుబాటు చేయడం సరికాదన్నారు. దీనివల్ల ఒక్కో సచివాలయంలో ఒక్కో విధానాన్ని అమలు చేస్తున్నట్లు అవుతోందన్నారు. ఎన్నికల వేళ ఉద్యోగులపై బలవంతపు బదిలీలను రుద్దడం తగదన్నారు. బదిలీలు కోరుకుంటున్న ఉద్యోగులకు బదిలీలు కల్పించి, జీవోనెంబరు ఒకటిని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నేతలు మునెప్ప, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును మళ్లీ సీఎం చేయాలి: థామస్



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 23: చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని గంగాధర నెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్ఆర్‌పురం మండల పరిధిలోని గ్రామాల్లో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ, ఇంటింటికి మన థామస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భాస్కర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, గిరినాయుడు, ఎత్తి రాజులు నాయుడు, మోహన్ నాయుడు, హేమాద్రి యాదవ్, పుల్లూరు బాబు, నీరంజన్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, బ్రహ్మానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు తెలియజేయండి: బీజేపీ



మురళికి నియామక పత్రం అందిస్తున్న చంద్రశేఖర్

పాలసముద్రం, ఫిబ్రవరి 23: కేంద్ర పథకాలను ప్రజలకు తెలియజేయాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాగర్లమూడి చంద్రశేఖర్ నాయుడు సూచించారు. శుక్రవారం ఆముదాలలో జరిగిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పథకాలను కూడా తమవిగా చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా తవణంపల్లె మండలానికి చెందిన ఆవుల మురళిని జిల్లా సాగునీరు సెల్ కన్వీనర్‌గా నియమించారు. నాయకులు బాలయ్య, వెంకటేష్, వాసు, బొమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య ఆదర్శంగా నిలవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 23: జిల్లా సమాఖ్యలోని మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని డీఆర్‌డీఏ పీడీ తులసి ఆకాంక్షించారు. శుక్రవారం జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షురాలు సుకన్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా తగిన వ్యాపారాలను ఎంచుకోవాలని సభ్యులకు సూచించారు. డీపీఎంలు వెంకటేష్, రవి, వాసు, ఏపీఎంలు వల్లి, సూరి, అనురాధ, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

తవ్వేసి.. వదిలేస్తున్నారు

- ప్రమాదాల బారిన వాహన చోదకులు



కార్వేటినగరం, ఫిబ్రవరి 23: కార్వేటినగరం నుంచి కొల్లగుంట వరకు 12 కి.మీ. పుత్తూరు- చిత్తూరు జాతీయ రహదారి పక్కన అండర్ గ్రౌండ్‌లో కేబుల్ వేయడానికి రోడ్డును ఇష్టారాజ్యంగా తవ్వేసి, వదిలేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాత్రిపూట ప్రయాణించే ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురౌతున్నారు. ఇకనైనా సంబంధించిన కాంట్రాక్టరు తవ్విన గుంతలను వెంటనే పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు, ఫిబ్రవరి 23:బాలికల భద్రత ప్రమాదకరంగా మారిందని, అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులకు బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, దిశ ఎస్ఐ నాగ సౌజన్య సూచించారు. బేటీ బచావో.. బేటీ పడావో పథకం అమలులో భాగంగా టీటీడీసీ సమావేశపు మందిరంలో ఐసీడీఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్తంగా ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలల దత్తతకు సంబంధించి మహిళా శిశు సంక్షేమశాఖచే రూపొందించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీవో వెంకటేశ్, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.